**జర్నలిస్టులు కావలెను**

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.



# క్రైం కౌంటర్

RNI : APTEL/2015/62250

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు వార పత్రిక

గుంటూరు

సంపుటి : 02 సంచిక : 250 ఆదివారం 31- 05 - 2026 పేజిలు : 8 వెల. 2/-



**రిపోర్టర్లు కావలెను**

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఏపీకి అరుదైన ఘనత..



**అమరావతి, మే 30 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అరుదైన ఘనత లభించింది. దేశంలోనే తొలిసారిగా పథకం అమలు చేయనున్న రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఈ మేరకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్టీరింగ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన 'స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్'కు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో విశాఖ ఐటీఐల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ప్రముఖ ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ భాగస్వామ్యంతో ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. జాతీయ స్థాయిలో రూ.60,000 కోట్ల బడ్జెట్‌తో చేపడుతున్న ఈ కార్యక్రమంలో మొదటి దశలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసింది. విశాఖ ఐటీఐల అభివృద్ధికి అకడమిక్ భాగస్వామిగా సంస్థ కూడా రంగంలోకి దిగింది. ఈ ప్రాజెక్టులో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌ను అమలు చేయనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఐటీఐ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. కోర్సు పూర్తి చేసిన వెంటనే విద్యార్థులకు నేరుగా పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్రం పేర్కొంది. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో భాగంగా ప్రభుత్వ ఐటీఐలను బలోపేతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీ బాటలోనే నడవడానికి మరో 12 రాష్ట్రాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పరిశ్రమల భాగస్వామ్యానికి వేగంగా టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని కేంద్ర వర్గాలు వెల్లడించాయి.

## డీకేకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్



**బెంగళూరు:మే 30 క్రైమ్ కౌంటర్ న్యూస్):** కర్ణాటకలో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా మాజీ ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ శనివారంనాడు అధికారికంగా ఆహ్వానించారు. బెంగళూరులోని లోక్‌భవన్‌లో జూన్ 3వ తేదీ మధ్యాహ్నం 4.05 గంటలకు రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా ఒక లేఖను గవర్నర్‌కు శివకుమార్ సమర్పించారు. దీంతో శివకుమార్, ఆయన మంత్రిమండలి సభ్యులను ప్రమాణస్వీకారానికి గవర్నర్ ఆహ్వానించినట్టు రాజ్‌భవన్ ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. దీనికి ముందు, విధాన సౌధలో జరిగిన సీఎల్‌పీ సమావేశంలో డీకే శివకుమార్ ఏకగ్రీవంగా సీఎల్‌పీ నేతగా ఎన్నికయ్యారు. డీకే పేరును పార్టీ అధిష్ఠానం సూచించగా, సీఎల్‌పీ సమావేశంలో తొలుత సిద్ధరామయ్య, ఆ తర్వాత డాక్టర్ జి.పరమేశ్వర ఆయన పేరును ప్రతిపాదించారు. దీనికి ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అధికారికంగా డీకే ఎన్నికను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకుంది. డీకే పాలనా పగ్గాలు చేపట్టనుండటంతో తక్కిన రెండేళ్లు ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగుతారు.




## బ్రో... జాగ్రత్త..!

**హిందూపురం(శ్రీ సత్యసాయి): మే 30 క్రైమ్ కౌంటర్ న్యూస్):** కొంతమంది రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల అనుచరులు, మరికొంత మంది మతాలు, కులాల మధ్య రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పోస్టులు సోషల్ మీడియాలో పెడుతున్నారు. ఈ పోస్టులు, ఈ వ్యాఖ్యలు ఎవరూ చూడలేదు కదా అని వారనుకుంటే పొరపడినట్లే. ఎందుకంటే సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేవారిపై నిఘా, చర్యలు తీసుకోవడానికి జిల్లా ఎస్పీ ఓ ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేశారు. వారు నిత్యం ఇలాంటి వాటిపైనే దృష్టి పెట్టారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా సోషల్ మీడియాలో పెట్టిన పోస్టును గుర్తించి ఎవరు పెట్టారనే దానిపై ఆరాతీసి వారిని జిల్లా కేంద్రానికి పిలిపించుకుని కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మొదటి విడతలో రాజకీయ పార్టీల మధ్య గొడవలు సృష్టించే విధంగా పోస్టులు పెట్టిన వారితోపాటు మతాలు, కులాలమధ్య రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిని

## తెలుగువారు ఎక్కడున్నా ఒక్కటే



**అమరావతి, మే 30 క్రైమ్ కౌంటర్ న్యూస్):** హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయంపై టీడీపీ జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో మహానాడు కార్యక్రమం నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. తొలిసారిగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు ఘనవిజయం సాధించిందని పేర్కొన్నారు. మహానాడును సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన కొన్ని వ్యాఖ్యలు సరికావు. ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే.. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు. టీడీపీ పుట్టిందే తెలంగాణ గడ్డపై, తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మహానాడులో ఆమోదించిన 33% మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి' అని అన్నారు.


## జిందాల్ 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్..



**అమరావతి, మే 30 క్రైమ్ కౌంటర్ న్యూస్):** పల్నాడు జిల్లా కొండవీడు పరిధిలోని జిందాల్ 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో చెత్తను సేకరించడం దగ్గర నుంచి బాయిలర్‌లో అది బూడిదగా మారే వరకూ.. ప్రక్రియను ఆసక్తిగా పరిశీలించారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ విధానంపై ప్లాంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా అధికారులు, ప్లాంట్ నిర్వాహకులకు ఉప ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిందాల్ పరిశ్రమ తరహాలోనే గోదావరి నదీ కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ సాంకేతికతను ఎలా అనుసంధానం చేయవచ్చో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో చెత్తను వేరు చేసి, దాన్ని విద్యుత్ తయారీకి ఉపయోగించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో రోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేలా మరిన్ని 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్ల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఇందుకోసం దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా పేరొందిన 'ఇండోర్ మోడల్' తరహాలో చెత్తను పద్ధతిగా, పారదర్శకంగా వేరు చేసేలా కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు.. ప్లాంట్ అధికారులు ఉప ముఖ్యమంత్రికి అంతర్జాతీయ, జాతీయ స్థాయి గణాంకాలను వివరించారు. సింగపూర్‌లో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 2.8 శాతం కేవలం ఇలాంటి చెత్త ప్లాంట్ల నుంచే లభిస్తోందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటు

2 లో

## ఎన్నారై ఆవేదన




**ఇంటర్నెట్ డెస్క్:** అమెరికాలో 1,500 పైచిలుకు జాబ్స్‌కు దరఖాస్తు చేసినా ఒక్క కంపెనీ కూడా స్పందించలేదంటూ ఒక హెచ్-1బీ వీసాదారుడు ప్రముఖ చర్చావేదిక రెడిట్‌లో పెట్టిన పోస్టు ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఈ పరిస్థితితో మానసిక వేదన అనుభవిస్తున్నానని ఎన్నారై చెప్పారు. తానేమీ ఫ్రెషర్‌ను కాదని అన్నారు. ఒహాయో రాష్ట్రంలో గత మూడేళ్లుగా డేటా ఇంజనీర్‌గా చేస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం తాను పనిచేస్తున్న కంపెనీ హెచ్-1బీ వీసా రెన్యూవల్‌కు సిద్ధంగా లేకపోవడంతో మరో జాబ్ కోసం వెతకాల్సి వస్తోందని అన్నారు. ఈ రంగంలో నాకు మంచి అనుభవం ఉంది. క్లౌడ్ టెక్నాలజీలు, ఈటీఎల్ వర్క్‌ఫ్లోస్, ప్రొడక్షన్ సిస్టమ్స్ వంటి అంశాలపై పట్టు ఉంది. అమెరికా వ్యాప్తంగా అనేక చోట్ల జాబ్స్‌కు దరఖాస్తు చేసుకున్నా స్పందన లేకపోవడం ఆవేదన కలిగిస్తోంది. ప్రస్తుతం మార్కెట్ ఇలా ఉందా? లేదా నేనున్న ప్రాంతం వల్ల సమస్యా? వీసా

2 లో


గుంటూరు, ప్రకాశం, విజయవాడ, కాకినాడ, అనంతపూర్, కడప ఎడిషన్లతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా వెలువడుతున్న క్రైం కౌంటర్ దినపత్రికలో వ్యాపార ప్రకటనలకు సంప్రదించండి. 9849707349

# బ్రో... జాగ్రత్త..!

గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా ఏ కేటగిరి కింద 50మంది వరకు ఉన్నట్లు సమాచారం. చేతిలో ఫోన్ ఉందికదా అని ఎవరో వాట్సాప్ లేదా ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్ట్ చేసిన దానిని ఫార్వర్డ్ చేయడం కొందరికి సర్వసాధారణమైంది. అయితే కొన్ని పోస్టులు సమాజంలో ఉద్రిక్తతకు దారితీసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకున్న జిల్లా ఎస్పీ ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని, ఇలాంటి పోస్టుల నియంత్రణకు జిల్లా కేంద్రంలో ఒక సోషల్ మీడియా వింగును ఏర్పాటు చేశారు. ఆయా మండలాల్లో ఉన్న నిఘా వ్యవస్థ ఎప్పటికప్పుడు చట్టవ్యతిరేక పోస్టులను పెట్టేవారి గురించి జిల్లా కేంద్రానికి సమాచారం అందిస్తోంది. ఇది తెలుసుకోకుండా సమాజంలో అశాంతి కలిగేలా పోస్టులు పెట్టేవారు, ఫార్వర్డ్ చేసేవారు జైలుకెళ్లాల్సిందే.

కొన్ని నెలల కిందట హిందూపురంలో ఒకరిద్దరు యువకులు ఓ పోస్టు ఫొటోను క్రియేట్ చేసి ఓ వర్గాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దానిని చూసిన ఆ వర్గం ఆగ్రహంతో సోషల్ మీడియా వేదికగానే ప్రశ్నించారు. దీనిపై ఇరు వర్గాలు కవ్వించేలా వ్యవహరిస్తుండటంతో ఎస్పీ అప్రమత్తమయ్యారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. కొన్ని రోజుల కిందట ధర్మవరంలో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్ అయ్యి రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. పోలీసులు అప్రమత్తం అయ్యారు కాబట్టి వివాదం సద్దుమణిగింది.

మూడు నెలల కిందట హిందూపురంలో ఓ పార్టీకి చెందిన వారు మరో పార్టీపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అవతలపార్టీ నాయకులు పెద్దగా స్పందించకపోవడంతో సరిపోయింది. లేదంటే పరిస్థితి చేజారేది.కొన్ని రోజుల కిందట హిందూపురంలోని ఓ వైసీపీ కార్యకర్త పలుమార్లు సోషల్ మీడియాలో అధికార పార్టీకి వ్యతిరేకంగా పోస్టులు పెట్టడం, డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యేపై పోస్టులు పెడుతూ వచ్చారు. కానీ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. పది రోజుల కిందట జనసేన నాయకులు ఆ విషయాన్ని పైస్థాయికి తీసుకెళ్లారు. దీంతో ఆ వైసీపీ కార్యకర్తను పిలిపించి పోలీసులు మందలించారు. ఇవన్నీ ఉదాహరణలు మాత్రమే ఇలాంటివి జిల్లా వ్యాప్తంగా చాలానే ఉన్నాయి.

జిల్లాలో పలుమార్లు రెచ్చగొట్టే పోస్టులు పెట్టినవారిని పార్టీలకు అతీతంగా గుర్తించారు. ఇందులో అధికార, ప్రతిపక్షాలకు చెందినవారు ఉన్నారు. మొదటి విడత కింద 50మందిదాకా గుర్తించారు. ఇందులో ఇప్పటి వరకు దాదాపు 20మందిని బైండోవర్ చేసినట్లు తెలిసింది. మొదటిసారి బైండోవర్ చేస్తారు. అదికూడా రూ.5లక్షల పూచికత్తుతో ఉంటుంది. ఒకవేళ బైండోవర్ అయిన తరువాత కూడా రెచ్చగొట్టే పోస్టులు పెడితే, బైండోవర్ నిబంధనలు అతిక్రమించినందుకు రూ.5లక్షలు జరిమానా, జైలుశిక్ష కూడా పడే అవకాశం ఉంది. జిల్లాలో ఇలాంటివారు వందల సంఖ్యలో ఉన్నారు. పలుమార్లు పోలీసులు హెచ్చరించినా తీరు మార్చుకోకుండా పోస్టులు పెట్టినవారిని గుర్తిస్తూ వస్తున్నారు. మొదట ఏ కేటగిరీరి, తరువాత బి, సి, డి కేటగిరీలుగా విభజించి వారిని బైండోవర్ చేస్తూ వెళ్తారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతాం. పోలీసులు హెచ్చరించినా వినకుండా మళ్లీ పోస్టులు పెట్టినవారిని ఏ కేటగిరీగా గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ చేయడం ప్రారంభించాం. నాలుగు రోజుల కిందటే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. జిల్లా వ్యాప్తంగా ఏ కేటగిరీ వారు 50మంది ఉన్నట్లు గుర్తించాం. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు పోస్ట్ చేసేవారిని విడతల వారీగా బైండోవర్ చేస్తాం. రెండోసారి చేస్తే రూ.5లక్షలు జరిమానాతోపాటు జైలుకు వెళ్లాల్సిందే.

# ఎన్నారై ఆవేదన

స్పాన్సర్‌షిప్ విషయంలో కంపెనీలు సందేహిస్తున్నాయా? లేక మరేదైనా సమస్య ఉందా?.. అసలు నాకు ఏమీ అర్థం కావట్లేదు' అని పోస్టు పెట్టారు. ఈ విషయంలో ఎవరైనా సలహా చెప్పాలని కోరారు. ఈ పరిస్థితిపై పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ కూడబెట్టుకున్న డబ్బు ఖర్చైపోకముందే ఇండియాకు వెళ్లిపోవాలని పలువురు సూచించారు. ఒక్క కంపెనీ కూడా స్పందించలేదంటే డేటా ఇంజనీరింగ్ నైపుణ్యాలు ప్రస్తుతం ఎవరికీ అవసరం లేదని భావించాలని మరికొందరు అన్నారు. ఇప్పటికే డేటా రంగ నిపుణులు అనేక మంది ఉద్యోగాల్లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

## జిందాల్ 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్..

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ గ్రిడ్‌తో ఈ వ్యర్థ ఆధారిత విద్యుత్ ప్లాంట్ల అనుసంధానం చాలా అద్భుతంగా ఉందని అధికారులు ప్రశంసించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సరఫరా వృథా శాతం అత్యంత తక్కువగా ఉండటం విశేషమని డిప్యూటీ సీఎంకు ఈ సందర్భంగా ప్లాంట్ అధికారులు తెలియజేశారు.

## పులి సంచారంపై నిరంతర పర్యవేక్షణ



**వేం 30 క్రైమ్ కౌంటర్ న్యూస్):**పోలవరం జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచారంపై ప్రజలు, అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. పులి కదలికలపై ఆధునిక సాంకేతకతతో నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలను అందుబాటులో ఉంచాలన్నారు. పోలవరం జిల్లా చికిలింత పంచాయతీలో పులి దాడిలో 9 దూడలు మృతి చెందటం పట్ల పవన్ విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తిమ్మాపురం రిజర్వ్ ఫారెస్ట్‌లో పులి కదలికలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీనిపై ఆయన స్పందిస్తూ పశువులు, మనుషులకు ఎలాంటి హాని కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, 24గంటలూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.



## జగన్ పీఏ అక్రమ సొమ్ము విదేశాలకు?

**మే 30 క్రైమ్ కౌంటర్ న్యూస్):** వైసీపీ అధినేత జగన్ పీఏ కె.నాగేశ్వర రెడ్డి(కేఎన్ఆర్) వందల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించినట్టు సిట్ విచారణలో వెల్లడైన విషయం తెలిసిందే. ఆయన ఆస్తులు ఇప్పటి వరకూ మూడు రాష్ట్రాల్లో బయటపడ్డాయి. అక్రమ సొమ్మును విదేశాలకు కూడా తరలించి పెట్టుబడులు పెట్టినట్టు తాజా విచారణలో వెలుగు చూసింది. కడప జిల్లా కమలాపురం ప్రాంతానికి చెందిన కేఎన్ఆర్ చిన్ననాటి స్నేహితుడు, తాను అరెస్టైతే తన స్థానంలో జగన్‌కు సేవలందించేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా తాడేపల్లికి తెచ్చి పెట్టుకున్న పుత్తా శివశంకర్ రెడ్డి (పీఎస్ఆర్)ని సిట్ అధికారులు ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రశ్నించారు. కేఎన్ఆర్ ఆర్థిక వ్యవహారాలు తనకు తెలియవంటూ మొదట్లో చాలా జాగ్రత్తగా అతడు చెప్పాడు. అయితే సిట్ అధికారులు మధ్యలో చాకచక్యంగా అడిగిన కొన్ని ప్రశ్నలకు విదేశీ పెట్టుబడులపై నోరు జారినట్లు తెలిసింది. విదేశాల్లో బంధువుల పేరుతో కేఎన్ఆర్ పెట్టుబడులు, దుబాయ్ మీదుగా యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీకి సొమ్ములు చేరడంపై చూచాయగా చెప్పినట్లు తెలిసింది.లిక్కర్ స్కామ్‌లో సిట్ అధికారులు జగన్ పీఏ కేఎన్ఆర్‌ను అరెస్టు చేస్తే.. ఆయన తాడేపల్లి ప్యాలెస్‌లో చేసే పనులన్నీ తాను చేసేందుకు సిద్ధమైనట్లు పుత్తా శివశంకర్ రెడ్డి వెల్లడించినట్లు తెలిసింది. ఒకే ఊరిలో పుట్టిపెరిగిన కేఎన్ఆర్, పీఎస్ఆర్ మంచి స్నేహితులు. సిట్ అధికారులు తనకు నోటీసు ఇచ్చిన రోజే తాడేపల్లిలో సజ్జల రామకృష్ణా రెడ్డి సహా మరికొందరు ముఖ్యులతో సమావేశమయ్యాడు. జగన్ వద్దకు శంకర్ రెడ్డిని సెట్ చేద్దామని అప్పుడే నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం పార్టీ నేతలతో జగన్ సమావేశమైనప్పుడు సీట్లో టవల్ సర్ది జగన్ చేతికి వాటర్ బాటిల్ అందించింది శంకర్ రెడ్డేనని సిట్ చూసిన విజువల్స్‌లో కనిపించింది. ఆస్తుల గుట్టు బయటపడేలోపు జగన్‌ను వదిలేసి కేఎన్ఆర్ విదేశాలకు వెళ్లిపోయే పథక రచన ఏమైనా చేశాడా అనే కోణంలో సిట్ ఆరా తీస్తోంది. జగన్ పీఏతో తనకు ఎలాంటి ఆర్థిక లవాదేవీలు లేవని చెప్పిన పీఎస్ఆర్‌ను లావాదేవీల రికార్డులతో ఆడిటర్‌ను వెంట తీసుకురావాలంటూ సిట్ అధికారులు చెప్పినట్లు తెలిసింది. మరోవైపు శుక్రవారం విచారణకు హాజరు కాని లక్కీ హ్యుందాయ్ కార్ల షోరూమ్ భాగస్వామిని సైతం ఆడిటర్‌తో కలిసి రావాలంటూ సిట్ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.

## కాలుష్యం నుంచి గోదావరికి విముక్తి



**మే 30 క్రైమ్ కౌంటర్ న్యూస్):**కాలుష్య రహిత గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం 'స్వచ్ఛ గోదావరి–పవిత్ర పుష్కరాలు' పేరిట డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యాచరణ ప్రణాళిక ప్రకటించారు. పుష్కరాల నిర్వహణకు ఆరు జిల్లాల పరిధిలో గుర్తించిన 262 గ్రామ పంచాయతీలను మురుగు రహితంగా తీర్చిదిద్దడంతోపాటు గోదావరి నదిలో కాలుష్య కారక వ్యర్థాల విడుదలను నిలువరించేందుకు నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగు నిర్వహణతోపాటు పారిశ్రామిక కాలుష్య పర్యవేక్షణకు ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, నిరంతర ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూముల్లో ప్రాంతాల వారీగా స్క్రీన్లు ఏర్పాటు చేసి, వాటిని సీసీ కెమేరాలకు అనుసంధానించాలని ఆదేశించారు. దీని పర్యవేక్షణ బాధ్యతను ప్రధాన నదుల కాలుష్య నివారణకు ఏర్పాటు చేసిన అత్యున్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌కు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు అవసరమైతే వీబీజీ రాంజీ, స్వచ్ఛాంధ్ర, కాలుష్య నియంత్రణ మండలి నిధులను కూడా వినియోగించుకుని, పుష్కరాల నాటికి 262 గ్రామాలను మురుగు విడుదల రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నారు. ఆరు జిల్లాల పరిధిలోని కొన్ని మున్సిపల్ పట్టణాల నుంచి రోజుకు 104 మిలియన్ లీటర్లు, గ్రామీణ ప్రాంతాల 8.38 మిలియన్ లీటర్లు మురుగు, ఆంధ్రపేపర్ మిల్స్ నుంచి రోజుకు 32 మిలియన్ లీటర్ల వ్యర్థాలు, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లా నుంచి 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం గోదావరిలో కలుస్తున్నదని అధికారులు వివరించారు.గృహ వినియోగ మురుగు నీటి నిర్వహణకు వీబీజీ రాంజీ పథకం కింద మ్యాజిక్ డ్రెయున్ల నిర్మాణం చేపట్టాలని పవన్ సూచించారు. బ్లాక్ వాటర్ నిర్వహణకు సామాజిక ఇంకుడు గుంతల తరహా నిర్మాణాలు చేపట్టాలన్నారు. కాలువలు, డ్రెయిన్ల ద్వారా మురుగును నేరుగా గోదావరి నదిలోకి విడుదల కాకుండా పంచాయతీ సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగునీటిని శుద్ధి చేసిన తర్వాతే గోదావరిలోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో మురుగునీటి శుద్ధ కేంద్రాలు చేపట్టాలని, ఇప్పటికే గోదావరి కాలుష్య నియంత్రణ కోసం పీసీబీ నుంచి మంజూరు చేసిన రూ.100కోట్లతోపాటు స్వచ్ఛాంధ్ర నిధులు వాడుకుంటూ దశల వారీగా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌పై దశల వారీగా నిషేధాన్ని అమలు చేయాలని గోదావరి ప్రాంత మున్సిపాలిటీలను ఆదేశించారు. గోదావరిలో కలుస్తున్న కాలుష్యంపై నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు.

## సి సి టి వి వలన బాధ్యతలు మరియు లాభాలు ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలి : బ్యూలా టెక్ట్రానిక్స్, బాపట్ల




**ది 30 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** ఇంటి వద్ద, కార్యాలయాలు లేదా వ్యాపార సంస్థలలో సీసీటీవీ (సిసిటివి) కెమెరాలను అమర్చడం వల్ల భద్రత, పర్యవేక్షణ మెరుగుపడతాయి. నేరాలను అరికట్టడంలో, ఉద్యోగుల ఉత్పాదకతను పెంచడంలో మరియు ఎవిడెన్స్ సేకరించడంలో ఇవి ఎంతగానో సహాయపడతాయి.

సీసీటీవీ కెమెరాల వల్ల కలిగే ప్రధాన లాభాలు :

నేరాలను అరికట్టడం : దుండగులు, దొంగలు సీసీటీవీ కెమెరాలను చూసినప్పుడు దాడులు లేదా దొంగతనాలు చేయడానికి వెనుకాడుతారు. ఇది ఒక బలమైన నిరోధకంగా పనిచేస్తుంది.

సాక్ష్యాల సేకరణ : ఒకవేళ అవాంఛనీయ ఘటనలు, దొంగతనాలు లేదా ప్రమాదాలు జరిగితే, రికార్డైన వీడియో ఫుటేజ్ పోలీసులకు దర్యాప్తు చేయడానికి మరియు నేరస్థులను పట్టుకోవడానికి సరైన సాక్ష్యంగా ఉపయోగపడుతుంది.

24/7 రిమోట్ పర్యవేక్షణ : స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా ఇంటర్నెట్ సహాయంతో, ప్రపంచంలో ఎక్కడి నుంచైనా మీ ఇల్లు లేదా వ్యాపార సంస్థను 24 గంటలూ లైవ్ లో పర్యవేక్షించవచ్చు.

ఉద్యోగులు మరియు పని ప్రదేశం భద్రత : కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు భద్రత ఉంటుంది. మరియు ఉత్పాదకత (ప్రొడక్టివిటీ) స్థాయిలు మెరుగుపడతాయి.

ప్రవేశాల నియంత్రణ : ఇల్లు, షాపు లేదా ఆఫీసులోకి ఎవరు వస్తున్నారు, ఎవరు వెళ్తున్నారు అనే విషయాలను స్పష్టంగా రికార్డ్ చేయవచ్చు. అపరిచిత వ్యక్తులను సులభంగా గుర్తించవచ్చు.

ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ : ఆఫీసులో అగ్నిప్రమాదాలు లేదా ఇతర నష్టాలు జరిగినప్పుడు, ఇన్సూరెన్స్ క్లెయిమ్ (ఇన్సూరెన్స్ క్లెయిమ్స్) చేసుకోవడానికి ఈ రికార్డింగ్స్ సరైన ఆధారంగా పనిచేస్తాయి.

మీ ఇంటి పరిరక్షణ మీ చేతుల్లో ఉంది...

బ్యూలా టెక్ట్రానిక్స్, (ఐఎస్ఓ సర్టిఫైడ్)
32 వ వార్డు, నరాలశెట్టి వారి పాలెం,
బాపట్ల పట్టణం, బాపట్ల జిల్లా, ఆం. ప్ర.
M : 9290767349

## ఎర్రమల శ్రీ లక్ష్మీ కంబగిరి స్వామినీ దర్శించుకున్న ఐ హెచ్ఆర్ఎఫ్. నేషనల్ వైస్ చైర్మన్



**క్రైమ్ కౌంటర్ న్యూస్:** అవుకు నంద్యాల జిల్లా మండలం ఉప్పలపాడు గ్రామాన వెలసిన ఎర్రమల శ్రీ లక్ష్మికంబగిరి స్వామివారిని శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్న అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ నేషనల్ వైస్ చైర్మన్ ఆర్. కంబగిరి స్వామి గారు అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి దేవస్థానాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశారని ఆలయ సిబ్బంది భక్తులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేయడం అపరిశుభ్రత కాలుష్యం లేకుండా దేవస్థానం ఆలయ ఆవరణంలో అంతా పరిశుభ్రంగా ఉంచారని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీటి సౌకర్యాన్ని కల్పించారని ఆలయ క్లర్క్ వెంకటేశ్వర్లు గారితో మాట్లాడి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు

# అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం





**వేటపాలెం, మే 30 (క్రైమ్ కౌంటర్):** వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేట గ్రామంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వారి దేవస్థానంలో శనివారం కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలు భక్తి శ్రద్ధలతో సాగాయి. ముందుగా అమ్మవారి పుట్టింటిగా భావించే బులసల వారి ఇంటి నుంచి పసుపు, కుంకుమలతో మేళతాళాల నడుమ ప్రత్యేక ఊరేగింపు నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణానికి పెళ్లిపెద్దలుగా సజ్జా బాలకృష్ణ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఉదయం 8:16 గంటలకు కళ్యాణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.

భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో సుమారు 2,500 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 7 గంటలకు స్వామివారి నగరోత్సవం నిర్వహించగా, గ్రామ వీధుల గుండా ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. నగరోత్సవం సందర్భంగా భక్తుల వినోదం కోసం ప్రత్యేకంగా వేట ప్రదర్శనను కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం జడ్పీటీసీ బండ్ల తిరుమలదేవి, బండ్ల బాబు, బులసల రామలింగం, బులసల ప్రసాద్, గుమ్మడి సుశీల, పేరిసెట్ల పద్మజ, పిచ్చిక సునీత, యారాసు అరుణ్‌బాబు, కుర్మా రాహుల్‌జీ, పిచ్చుక భార్గవ్, దేవన గంగాధర్, లవకుమార్, కిషోర్, సురేంద్ర, సురేష్, ఉమా, బి.సురేంద్ర, నాగేశ్వరరెడ్డి, ఉమ్మటి భాస్కర్ కుమారస్వామి, సుబ్బయ్య, భద్రయ్య, లవయ్య, బాబురావు, రాజు, శ్రీను, వేణు, జగన్, రామలక్ష్మి, రాధ, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన సేవలకు గుర్తింపుగా కొమరగిరి వెంకటప్రసాద్‌కు ప్రభుత్వ సన్మానం

**వేటపాలెం, మే 30 (క్రైమ్ కౌంటర్):** గిరిజనుల అభ్యున్నతి కోసం గత 25 సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తున్న బాపట్ల జిల్లాకు చెందిన గిరిజన ముద్దుబిడ్డ కొమరగిరి వెంకటప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ సంస్థ ప్రత్యేకంగా సన్మానించింది.గిరిజన సమాజ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను గుర్తించిన ప్రభుత్వం, విశాఖపట్నంలోని గిరిజన కార్యాలయానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా అధికారులు ఆయన సేవలను ప్రశంసించి, భవిష్యత్తులో కూడా గిరిజనుల సంక్షేమానికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కొమరగిరి వెంకటప్రసాద్‌కు లభించిన ఈ గౌరవం బాపట్ల జిల్లా ప్రజలకు, ముఖ్యంగా వేటపాలెం మండల ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా స్థానికులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు, పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# మహిళల భద్రతకు ప్రాధాన్యత

## -నేరస్తులకు కఠిన శిక్షలు తప్పవు: ఎస్పీ ఉమామహేశ్వర్





**చీరాల, మే 30 (క్రైమ్ కౌంటర్):** బాపట్ల జిల్లా చీరాలలోని కొత్తపేట రావి సుబ్బారాయుడు కళ్యాణ మండపంలో సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల భద్రత అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహమ్మద్ మోయిన్, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, సి డి పి ఓ టి ఝాన్సీ, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వేధింపులకు పాల్పడడం లేదా దాడులు చేయడం వంటి ఘటనల్లో నిందితులకు కఠిన శిక్షలు విధించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మహిళలు భద్రంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం సురక్షితంగా ఉంటాయని ఆయన అన్నారు. మహిళల రక్షణ కోసం "ఆపరేషన్ దండయాన్" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. కోర్టు మానిటరింగ్ కమిటీ మరియు పోలీసు శాఖ సమన్వయంతో నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి మహిళలపై వేధింపులు, దాడులకు సంబంధించిన కేసుల్లో నిందితులకు 10 నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకున్నామని ఎస్పీ వివరించారు. ఈవ్‌టీజింగ్, మహిళల వేధింపులు, సైబర్ నేరాలు, హరాస్మెంట్, గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మహిళలకు సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మహిళలకు గౌరవం, భద్రత కల్పించే బాధ్యతతో వ్యవహరించాలని ఎస్పీ ఉమామహేశ్వర్ పిలుపునిచ్చారు.

# నేడు కోసూరు ఎంపీడీవో పదవి విరమణ మహోత్సవం



**క్రైంకౌంటర్ కోటేశ్వరరావు కోసూరు న్యూస్ :** పంచాయతీరాజ్ శాఖలో వివిధ హోదాల్లో పని చేసి పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గ క్రోసూరు మండల ఎంపీడీవో గా పదవీ విరమణ చేయుచున్న గడ్డం రవికుమార్ పదవి విరమణ మహోత్సవం క్రోసూరు గ్రామంలోని షాదీ ఖానాలో (పోలీస్ స్టేషన్ దగ్గర )నేడు ఆదివారం అనగా ఈరోజు నిర్వహిస్తున్నారు . ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు నాయకులు నియోజకవర్గ, మండల స్థాయి పాత్రికేయ మిత్రులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోసూరు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శనివారం తెలియజేశారు.

# ఏర్పాటుకు సహకరించండి

**మే 30 (క్రైమ్ కౌంటర్ న్యూస్):**తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల వస్త్ర పరిశ్రమ క్లస్టర్లకు సమీపంలో ఉన్న కుప్పంలో పీఎం మిత్రా పార్కును ఏర్పాటు చేయాలని సీఎం కేంద్రాన్ని కోరారు. సచివాలయంలో శుక్రవారం తనను కలిసిన కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ముందు సీఎం ఈ ప్రతిపాదన ఉంచారు. ఫైబర్ టు ఫ్యాషన్‌కు అనుకూలించేలా పీఎం మిత్రా పార్కు 2.0ను ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. అమరావతిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి అవసరమైన రూ.280 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. నిఫ్ట్ కోసం అమరావతిలో పదెకరాలు కేటాయించామన్నారు. ఏపీలోని వివిధ వస్త్ర పరిశ్రమ క్లస్టర్లలో ఇంటిగ్రేటెడ్ వెట్ ప్రాసెసింగ్ పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. నేషనల్ న్యూ ఏజ్ ఫైబర్ మిషన్ కింద ఏపీని ప్రాధాన్యత రాష్ట్రంగా గుర్తించాలన్నారు. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద మంగళగిరిలో రూ.22.36 కోట్లతో చేనేత పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. అమరావతిలో చేనేత హస్త కళల మ్యూజియం ఏర్పాటుకు సహకరించాలన్నారు. కాగా, ఏపీలో వేర్వేరు ఉద్యాన పంటల ద్వారా ఉత్పత్తి అవుతున్న ఫైబర్‌కు ప్రోత్సాహం కల్పించాలని సీఎం కోరారు. రాయలసీమ సహా కోస్తాంధ్ర ప్రాంతాల్లో సాగు చేస్తున్న వివిధ పంటల ద్వారా పీచు, నార, ఫైబర్ ఉత్పత్తి అవుతోందని, దీనికి వాణిజ్య స్థాయిలో విలువ జోడించేందుకు అవకాశాలను పరిశీలించాలని కోరారు.పీచు వెలికితీతతోపాటు వస్త్ర పరిశ్రమకు ఉపయోగపడే ఉద్యాన పంటల నివేదికను సీఎం కేంద్రమంత్రికి సమర్పించారు. వస్త్ర పరిశ్రమతో పీపీపీ భాగస్వాముల ద్వారా వెదురుకు సంబంధించిన మెకానికల్ ఫైబర్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. చాపలు, జియో టెక్స్‌టైల్ రోల్స్, కాంపోజిట్ బోర్డుల తయారీకి ఇది అనుకూలంగా ఉంటుందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా వీటి తయారీకి ఆస్కారం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని తీర ప్రాంత జిల్లాల్లో కొబ్బరి పీచు పరిశ్రమను బలోపేతం చేసేలా ప్రస్తుత కాయర్ బోర్డు డ్వాక్రా నెట్‌వర్క్ ద్వారా మెకనైజ్డ్ హస్క్ ప్రాసెసింగ్ యూనిట్లు, కాయర్ జియో టెక్స్‌టైల్స్ పరిశ్రమల స్థాపనకు జౌళి శాఖ సహకారం కావాలని సీఎం కోరారు. సీఎం ప్రతిపాదనలపై స్పందించిన కేంద్రమంత్రి గిరిరాజ్.. ఏపీకి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్‌తో స్వచ్ఛ నరసరావుపేట దిశగా అడుగులు

## పెద్ద చెరువులో పారిశుధ్య పనులు.. స్వచ్ఛతపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట (ప్రతినిధి :జి.ఎం.కె)-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లాలో మే 22 నుంచి జూన్ 20 వరకు నాలుగు వారాలపాటు నిర్వహిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నరసరావుపేటలో ముమ్మరంగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు మొదటి లైన్ ప్రాంతంలో విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు.నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.రమ్య కీర్తన, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు, ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. రహదారుల వెంట పేరుకుపోయిన చెత్తను తొలగించడం,మురుగు కాలువలను శుభ్రపరచడం,దోమల నివారణ చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ నరసరావుపేటను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమని, పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జనాభా వేగంగా పెరుగుతోందని అందుకు అనుగుణంగా మున్సిపల్ సేవలు, ముఖ్యంగా పారిశుధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శానిటేషన్ సిబ్బంది సంఖ్య పెంపు, అవసరమైన వాహనాలు,పరికరాల సమీకరణ విషయాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన మాట్లాడుతూ ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక శుభ్రత చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.చెత్త రహిత నరసరావుపేట లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించడం, రహదారులపై చెత్త వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా స్వచ్ఛాంధ్ర లక్ష్యానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.దీనిలో భాగంగా ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ ఇరువురు స్వయంగా స్వచ్ఛ పనుల్లో పాల్గొని పట్టణ వాసులకు ఆదర్శంగా నిలిచారు.

# ఎన్టీఏ నిర్వహించే మరో ప్రవేశ పరీక్షలో లోపాలు

**మే 30 క్రైమ్ కౌంటర్ న్యూస్):**నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో జాతీయ పరీక్ష ఏజెన్సీ (ఎన్టీఏ) తీరు వివాదాస్పదమైంది. అదే ఎన్టీఏ జాతీయ స్థాయిలో నిర్వహించే మరో ప్రవేశ పరీక్ష కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (సీయూఈటీ) యూజీ-2026 నిర్వహణలో కూడా లోపాలు తలెత్తాయి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ సైన్స్ పరీక్ష పలుమార్లు నిలిచిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం సెషన్‌లో 3 గంటలకు జరగాల్సిన పరీక్షకు 2.30 గంటల వరకు అభ్యర్థులను లోపలికి అనుమతించారు. తీరా పరీక్ష ప్రారంభం నుంచి సాంకేతిక సమస్యలతో అంతరాయం కలుగుతూనే ఉంది. రెండు సబ్జెక్టులు రాయల్సిన వారికి 5 గంటలకు, మూడు సబ్జెక్టులు రాయాల్సిన వారికి 6 గంటలకు పరీక్ష ముగుస్తుంది. అవాంతరాల మధ్య చివరకు పరీక్షను ఎట్టకేలకు రాత్రి 9 గంటలకు ముగించారు.

# నరసరావుపేట రాజకీయాల్లో వేడి.

## అభివృద్ధి పై చర్చకు సిద్ధం - గోపిరెడ్డి. శ్రీనివాస రెడ్డి.



క్రైమ్ కౌంటర్: నరసరావుపేట (ప్రతినిధి.జి.ఎం.కె.)- ఎమ్మెల్యే అరవింద బాబు ప్రతిపాదనను స్వాగతిస్తున్నామని నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలకు వాస్తవాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద చర్చ నిర్వహిస్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉందని అందువల్ల టౌన్ హాల్ లేదా ప్రజలకు అనువైన వేదికపై చర్చ నిర్వహించాలని సూచించారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా మీడియా సమక్షంలో బహిరంగ చర్చ జరగాలని కోరారు.గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలపై పూర్తి వివరాలతో ప్రజల ముందుకు రావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ముఖ్యంగా ఇళ్ల స్థలాల పంపిణీ, రహదారుల నిర్మాణం, తాగునీటి సదుపాయాలు,విద్యా, వైద్య రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించవచ్చన్నారు. తమ హయాంలో సుమారు 15 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని అందుకు సంబంధించిన పూర్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు.నియోజకవర్గంలో గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, మంజూరైన నిధులు, పూర్తి చేసిన ప్రాజెక్టులు, ప్రజలకు అందించిన సంక్షేమ ప్రయోజనాలపై కూడా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని గోపిరెడ్డి తెలిపారు. రాజకీయ విమర్శల కోసం కాకుండా ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే తమ ఉద్దేశమన్నారు.ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ కాలంలో ఎంతమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారో ఎన్ని అభివృద్ధి పనులు పూర్తి చేశారో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎన్నికల హామీల అమలు,యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు అందించిన చేయూత,తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కూడా ప్రజల ముందు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.చర్చకు తేదీ,సమయం ప్రకటిస్తే మేము తప్పకుండా హాజరవుతాం మా పాలనలో చేసిన పనులపై పూర్తి ఆధారాలు తీసుకొస్తాం అదే విధంగా ప్రస్తుత ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో అధికార పార్టీ కూడా ప్రజల ముందు చెప్పాలి అని అన్నారు.ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని ఎవరు నిజం చెబుతున్నారో,ఎవరు అభివృద్ధి చేశారో వారే నిర్ణయిస్తారు"అని గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఘనంగా సత్కరించిన పల్నాడు జిల్లా ఎస్పీ.



క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట (ప్రతినిధి : జి.ఎం.కె.)- పల్నాడు జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఏడుగురు పోలీసు సిబ్బందిని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు.జిల్లా పోలీసు కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు వారికి పూలమాలలు వేసి జ్ఞాపికలు అందజేసి వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం దశాబ్దాల పాటు అంకితభావంతో పనిచేసిన పోలీసు అధికారులు,సిబ్బంది అందరికీ అభినందనలు తెలిపారు.ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లు,ఒత్తిడులను ఎదుర్కొంటూ ప్రజలకు సేవలందించిన వారి కృషి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.విధి నిర్వహణలో నిజాయితీ,క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేసిన వారి సేవలు పోలీసు శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. రిటైర్ అయిన వారిలో నరసరావుపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్సై ఆర్.మంత్రు నాయక్, ఎడ్లపాడు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఎస్.కె. ఇస్మాయిల్,ఎస్‌బీ చిలకలూరిపేట ఏఎస్ఐ వై. శ్రీనివాసరావు, నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ జి.వెంకటేశ్వరరావు, డీఏఆర్‌లో ఏఆర్ఎస్ఐ సీహెచ్.శామ్యూల్, ఏఆర్‌పీసీ పి. రహమతుల్లా ఖాన్, మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్ హోంగార్డు బి. రాజా నాయక్ ఉన్నారు. వీరంతా 33 నుండి 40 సంవత్సరాలకుపైగా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో సేవలందించి ప్రజల ప్రశంసలు పొందారు.పోలీసు అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించడంలో వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని ఎస్పీ పేర్కొన్నారు.పోలీసు సేవల వెనుక కుటుంబ సభ్యుల త్యాగం, సహనం, ప్రోత్సాహం కూడా ఉంటాయని వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జె.వి. సంతోష్,వి.సత్తిరాజు, ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీ రెడ్డి, హోంగార్డ్ ఆర్ఐ ఎస్. కృష్ణ, వెల్ఫేర్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్, పల్నాడు జిల్లా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. మాణిక్యాలరావు, పోలీసు అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత.

## పట్టణ పురపాలక వ్యవస్థ ప్రక్షాళన చర్యల్లో కమీషనర్ రమ్య కీర్తన



క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట (ప్రతినిధి :జి.ఎం.కె.)- నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డుపై రహదారిని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలపై మున్సిపల్ అధికారులు శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన ప్రత్యక్ష పర్యవేక్షణలో సాగిన ఈ చర్యల్లో జేసీబీల సహాయంతో ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. రహదారిపై నిర్మించిన షెడ్లు,మెట్లు,ప్రహరీ గోడల భాగాలు, తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేసి రోడ్డును స్వాధీనం చేసుకున్నారు.పల్నాడు రోడ్డులో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ,వాహనదారులు మరియు పాదచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రహదారి వెడల్పు తగ్గిపోవడంతో తరచూ ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని, అత్యవసర సేవల వాహనాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.డ్రైవ్‌కు ముందు పలుమార్లు నోటీసులు జారీ చేసి స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని సంబంధిత యజమానులకు సూచించినప్పటికీ స్పందన లేకపోవడంతో చివరకు కూల్చివేత చర్యలకు దిగినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు.పట్టణ ప్రణాళిక నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపట్టే నిర్మాణాలపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.పట్టణ అభివృద్ధి,రహదారుల విస్తరణ,ప్రజల భద్రత కోసం ఆక్రమణల నిర్మూలన కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు.ప్రధాన రహదారులు,కూడళ్లు, కాలువలు, ఫుట్‌పాత్‌లు మరియు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై ప్రత్యేక దృష్టి సారించామని ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గత కొన్ని రోజుల నుండి పట్టణంలో పారిశుధ్య పనులు వేగం పుంజుకున్నాయి.పాత పల్నాడు బస్ స్టాండ్ నుండి ఎస్.ఎస్.ఎన్. కళాశాల వరకు ఆక్రమనల తొలగింపుతో పల్నాడు రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు కొంతవరకు తగ్గే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు. పట్టణంలో ఆక్రమణల నిర్మూలనకు పురపాలక శాఖ వారు చేపట్టిన చర్యలను పలువురు ప్రజలు స్వాగతించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం,టౌన్ ప్లానింగ్ అధికారులు,రెవెన్యూ సిబ్బంది,కార్మికులు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లా అభివృద్ధి కార్యక్రమాలలో కోట్ల రూ వెచ్చించి కొన్ని ప్రారంభోత్సవాలు మరియు మరికొన్ని భూమి పూజలు చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు, బాపట్ల పార్లమెంట్ సభ్యులు, బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ మరియు ప్రముఖులు






ది 30 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్) కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో 25 లక్షల రూపాయలతో పి4లో భాగంగా గుండ్రెడ్డి సత్యనారాయణ సహాయ సహకారంతో నూతనంగా నిర్మించబోయే హిందు స్మశానవాటిక ప్రహరిగోడ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు శ్రీ కొలుసు పార్థసారథి, బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, రాష్ట్ర గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, పమిడి భాస్కరరావు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బాపట్ల పట్టణంలోని ప్యాడిసన్ పేటలో ఒక కోటి ఇరవై లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు శ్రీ కొలుసు పార్థసారథి, బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, రాష్ట్ర గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, ఆర్.డి.ఓ గ్లోరియా, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, పమిడి భాస్కరరావు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.బాపట్ల పట్టణం ప్యాడిసన్ పేటలో వివధ వార్డులలో మూడు కోట్ల నిధులతో నిర్మించబోయే రోడ్లు మరియు డ్రైనేజీల శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి, బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్, బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, రాష్ట్ర గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, ఆర్ .డి.ఓ. గ్లోరియా, బాపట్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, బాపట్ల మార్కెట్ చైర్మన్ కావూరి శ్రీనివాస్ రెడ్డి, మరియు కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బాపట్ల పట్టణం డి.ఎస్పి ఆఫీస్ రోడ్డులో ఏడు కోట్ల రూపాయలతో నూతనంగా సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి, బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్, బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, రాష్ట్ర గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, ఆర్.డి.ఓ. గ్లోరియా, బాపట్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, బాపట్ల మార్కెట్ చైర్మన్ కావూరి శ్రీనివాస్ రెడ్డి, మరియు కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 6న ఇంటర్ కాలేజీలు పునఃప్రారంభం



మే 30 (క్రైమ్ కౌంటర్ న్యూస్):జూనియర్ కాలేజీల పునఃప్రారంభాన్ని ఇంటర్ విద్యామండలి వాయిదా వేసింది. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 వరకు ఉన్నందున 6న కాలేజీలు పునఃప్రారంభమవుతాయని బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓవైపు కొన్ని కాలేజీల్లో పరీక్షా కేంద్రాలు ఉండటం, సిబ్బందికి పరీక్షల విధుల కేటాయించిన నేపథ్యంలో పునఃప్రారంభ తేదీని మార్చినట్లు తెలిపారు. కాగా, ఇదే విషయంపై 'అటు పరీక్షలు... ఇటు తరగతులు' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది.

## బాపట్ల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి బాపట్ల జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొలుసు పార్థసారథి కి స్వాగతం పలికిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు



**ది 30 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** బాపట్ల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి బాపట్ల జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీ కొలుసు పార్థసారథి కి స్వాగతం పలికిన ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు. పర్యటన వివరాలు క్రింది విధం గా తెలియచేయబడినాయి.

– కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో 25 లక్షల రూపాయలతో పి4లో భాగంగా గుండ్రెడ్డి సత్యనారాయణ సహాయ సహకారంతో నూతనంగా నిర్మించబోయే హిందు స్మశానవాటిక ప్రహరిగోడ శంకుస్థాపన.

– బాపట్ల పట్టణంలోని ప్యాడిసన్ పేటలో ఒక కోటి ఇరవై లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం.

– బాపట్ల పట్టణం ప్యాడిసన్ పేటలో వివధ వార్డులలో మూడు కోట్ల నిధులతో నిర్మించబోయే రోడ్లు మరియు డ్రైనేజీల శంకుస్థాపన.

– బాపట్ల పట్టణం డి.ఎస్పి ఆఫీస్ రోడ్డులో ఏడు కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించబోయే సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ శంకుస్థాపన.

– బాపట్ల పట్టణం పేయింటర్స్ కాలనీలో 25 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన చిల్డ్రన్స్ పార్కు ప్రారంభోత్సవం.

– బాపట్ల మండలం సూర్యలంకలో జరిగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి , అధికారులతో సమీక్ష సమావేశం.

## వర్షాల వేళ ప్రజలకు అండగా ఉండాలి.. సమస్యలను వెంటనే పరిష్కరించాలి: ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి



**పెద్దవడుగూరు మే 30 క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్** ఇటీవల కురిసిన వర్షాలతో ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి నాయకులకు సూచించారు. వర్షాల కారణంగా గ్రామాల్లో ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకోవాలని, చిన్నచిన్న సమస్యలను స్థానిక స్థాయిలోనే పరిష్కరించే ప్రయత్నం చేయాలని నాయకులకు సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అలాగే సాధారణ సమస్యలను స్థానికంగానే పరిష్కరించడంతో పాటు పెద్ద సమస్యలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిసింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు చురుకుగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రజా సేవే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ ప్రతి గ్రామంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రజలకు భరోసాగా నిలవాలని ఎమ్మెల్యే నాయకులకు సూచించారు.

# పల్నాడు రోడ్డు లోని బిర్యానీ పాయింట్‌కు నోటీసులు. ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో గుర్తించిన లోపాలపై చర్యలు.

**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట (ప్రతినిధి :జి.ఎం.కె.)–** పట్టణంలోని పల్నాడు రోడ్డులో గల బిర్యానీ పాయింట్‌పై ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు.లోపాలను గుర్తించి యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు.ఫుడ్ సేఫ్టీ అధికారి నిందుజర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో ఆహార భద్రతా ప్రమాణాలకు సంబంధించిన పలు లోపాలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.

తనిఖీల సమయంలో వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం,సిబ్బంది పరిశుభ్రత, వినియోగంలో ఉన్న ముడి సరుకుల నాణ్యత,ఆహార భద్రతా, లైసెన్స్ నిబంధనల అమలును పరిశీలించారు.కొన్ని అంశాల్లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ఇండియా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు గుర్తించడంతో యాజమాన్యానికి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అలాగే తనిఖీల సందర్భంగా సేకరించిన ఆధారాలు, నమూనాలు మరియు తనిఖీ నివేదికల ఆధారంగా జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేశామని తెలిపారు.కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించిన అధికారులు విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి నిందుజర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హానికరంగా ఉండే విధంగా ఆహార వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటళ్లు,రెస్టారెంట్లు, బేకరీలు,ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు తప్పనిసరిగా ఆహార భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. పరిశుభ్రమైన



వాతావరణంలో ఆహార తయారీ,నిల్వ మరియు విక్రయాలు నిర్వహించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు.జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రతా తనిఖీలు మరింత ముమ్మరం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న వ్యాపార సంస్థలపై జరిమానాలు, లైసెన్స్ రద్దు వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు కూడా ఆహార నాణ్యతపై అనుమానాలు ఉంటే ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరారు.

## సూర్య లంక బీచ్ అత్యవసర మెడికల్ ఆరోగ్య కేంద్రం ను ప్రారంభించి అభివృద్ధి పనులను తిలకించిన ముఖ్య అతిధి మంత్రి కొలుసు పార్థసారథి




**ది 30 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** బాపట్ల మండలం. శనివారం సాయంత్రం సూర్యలంక బీచ్ నందు బీచ్ అత్యవసర మెడికల్ ఆరోగ్య కేంద్రం ను రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభోత్సవం చేశారు. బీచ్ ఆఫీసు ను దర్శించి అనంతరం కొబ్బరి మొక్కలు నాటారు. వసతులు, ఏర్పాట్లు మరియు భద్రత విషయాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మంత్రి కి వివరించారు. ఈ కార్యక్రమం లో బాపట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.కోటేశ్వరరావు, బావుడా చైర్మన్ రాజశేఖర్ బాబు, తాతా జయప్రకాష్ నారాయణ, ఆర్డీఓ. పి.గ్లోరియా, డి పి ఓ.ప్రభాకర్ రావు, ఇంచార్జి టూరిజం ఆఫీసర్, అనంద్ సత్య పాల్, డి యం ఒ హెచ్ ఓ.డాక్టర్ ఎస్.విజయమ్మ, డి సి హెచ్ ఎస్.డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యలను అధికారులు పరిష్కరించాలి... ఎంపీపీ గంగసాని లక్ష్మి



**పామూరు, మే 30, క్రైం కౌంటర్** ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. శనివారం పామూరు మండలం పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగసాని లక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగినది. ఈ సమావేశంలో 15వ ఆర్థిక సంఘం చేపట్టవలసిన పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఎంపిపి గంగసాని లక్ష్మి మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా గ్రామాలలో నీటి కొరత లేకుండా చూడాలని, వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే ఆశా వర్కర్ల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని, నూతనంగా ఏర్పాటు చేసిన మార్కాపురం జిల్లాకు పామూరు నుండి మార్కాపురం కు బస్సులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, కో ఆప్షన్ సభ్యులు కాజా నాయబ్

**15వ ఆర్థిక సంఘం పనులకు సభ్యుల ఆమోదం**
**గ్రామాలలో నీటి సమస్య లేకుండా చూడాలి**
**పామూరు నుండి మార్కాపురం కు బస్సు ఏర్పాటు చేయాలి**
**వృద్ధులకు ఇంటి వద్దనే ఆశ వర్కర్ల ద్వారా ఓఆర్ఎస్ పంపిణీ చేయాలి**




రసూల్, ఎంపీటీసీ లు, డిప్యూటీ తాసిల్దార్, కరెంటు ఏఈ జిలాని, ఎంఈఓ పి కోటి రెడ్డి, ఏవో అబ్రహం లింకన్, ఆర్డబ్ల్యూసీ ఏఈ, ఇరిగేషన్, హౌసింగ్ తదిత అధికారులు పాల్గొన్నారు.

# గాదె వెంకటరెడ్డి పార్థివ దేహానికి నివాళులు



**పర్చూరు, మే 30 (క్రైమ్ కౌంటర్):** పర్చూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదన్ రెడ్డి తండ్రి గాదె వెంకటరెడ్డి పార్థివ దేహానికి పలువురు పార్టీ నాయకులు శనివారం నివాళులు అర్పించారు.బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వాసి మల్ల వాసు, బీసీ సెల్ చీరాల నియోజకవర్గ అధ్యక్షులు పల్లెపు ఇమాన్యుయేల్, జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు కలిసి పూలమాలలు వేసి గాదె వెంకటరెడ్డి కి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు గాదె వెంకటరెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, గాదె మధుసూదన్ రెడ్డి కి తమ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ, మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# అశాంతి, అనిశ్చితి సృష్టికి కుట్రలు: ఎమ్మెల్సీ భూమిరెడ్డి

**మే 30 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ‘సీఎం పదవి నుంచి దిగిపోయిన మొదటి రోజు నుంచే జగన్‌రెడ్డి రాష్ట్రంలో అశాంతి, అనిశ్చితి సృష్టించాలని కుట్రలు పన్నుతున్నారు. మళ్లీ ఎప్పుడు అధికారంలోకి వచ్చి దోపిడీలు చేయాలా అనే ఆలోచనతోనే జగన్ బతుకుతున్నారు’ అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘16347 మంది ఉపాధ్యాయుల నియామకాలు పూర్తయి అందరూ ఉద్యోగాలు చేసుకుంటుంటే జగన్‌కి ఇప్పుడు డీఎస్సీలో అక్రమాలు జరిగాయని గుర్తుకు రావడం విడ్డూరంగా ఉంది. కేవలం కుట్రపూరిత ఆలోచనతోనే జగన్ ఈ ఆరోపణలు చేస్తున్నారు. జగన్ రెడ్డి తండ్రి వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో 2006లో డీఎస్సీ నిర్వహించారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా నియామక ప్రక్రియ జరిగింది. ఆ సమయంలో వైఎస్సార్ బంధువులు ఒక్కో ఉద్యోగానికి రూ.10



లక్షలు చొప్పున వసూలు చేసి, ఏకంగా ఓఎంఆర్ షీట్లనే దిద్దేశారు. జగన్ హయాంలో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల్లోనూ ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయి. జగన్ హయాంలోనే కడప జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల్లోనూ దారుణమైన స్కాంకు తెరదీశారు. విచారణలో ఇవన్నీ తేలడంతో మూడు రోజుల క్రితం ఆ ఉద్యోగులందరినీ డిస్మిస్ చేశారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని నిరూపించే దమ్ము జగన్‌కు ఉంటే నిరూపించాలి’ అని భూమిరెడ్డి సవాల్ చేశారు.

# సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ.




**పామూరు, మే 29, క్రైం కౌంటర్** పామూరు పట్టణంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను సుందరయ్యా భవన్ సెంటర్లో సిఐటియు సీనియర్ నాయకులు షేక్ అల్లాబక్ష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మాజీ జిల్లా నాయకులు కే మాల్యాద్రి మాట్లాడుతూ సిఐటియు దేశంలో అత్యధిక సభ్యత్వం కలిగి సంఘం అని అన్నారు. కార్మిక వర్గాల సమస్యల కోసం నిరంతరం పోరాడుతున్న సిఐటియు లేబర్ కోడ్స్ మీద కనీస వేతనాల కోసం, హక్కుల కోసం నిరంతరాయంగా పోరాడుతున్న కార్మికులకు అండగా నిలబడుతుందని అన్నారు. సిఐటియు మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు, సుబ్బారావు ఎస్ పిచ్చి రెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, భాష, షేక్ ఖాసిం సాహెబ్, కార్మిక నాయకులు పాల్గొన్నారు.







**క్రైమ్ కౌంటర్ న్యూస్ ....మార్కాపురం జిల్లా....**మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ కందుల నారాయణరెడ్డి , ఆదేశాల మేరకు. గౌరవనీయులు శ్రీ కందుల వేణుగోపాల్ రెడ్డి , ఆధ్వర్యంలో ..ఈరోజు మార్కాపురం పట్టణంలోని 15వ బ్లాకు బాపూజీ కాలనీ నందు ర్ ఏరియాలో నీళ్లు లేక అనేక ఇబ్బందులు పడుతుంటే రెండు బోర్లను రిపేర్ చేయించడం జరిగింది నూతనంగా పైపులైను ఏర్పాటు చేసి ఈరోజు గౌరవనీయులు శ్రీ కందుల వేణుగోపాల్ రెడ్డి , ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైను ఓపెనింగ్ చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో వార్డు నాయకులు. ఒబిన బోయిన రామాంజనేయులు నందం శేఖర్. అరకల వెంకట సుబ్బారెడ్డి. పటాన్ షరీఫ్ వంగూరు జోసఫ్ దరవేమిల శిఖామణి బల్లని రమణ జగన్నాధం రామయ్య. జగన్నాథం కృష్ణమూర్తి జగన్నాథంకాయ దాసరి భగవాన్ వార్డు నాయకులు పాల్గొన్నారు.....

# డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి అన్నదానానికి విశేష స్పందన

## ఆపన్నులకు భోజన వసతి కల్పించడం ఆనందదాయకం... డాక్టర్ పి మల్లికార్జున రెడ్డి







**పామూరు, మే 29,క్రైం కౌంటర్** ఆపన్నలకు భోజన వసతి కల్పించడం ఆనందదాయకమని పామూరు పట్టణంలోని మల్లికార్జున రెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి మల్లికార్జున రెడ్డి అన్నారు.శనివారం పామూరు పోలీస్ స్టేషన్ దగ్గర పామూరు రమణమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో యువసముద్రం సహకారం తో ప్రతి శనివారం మధ్యాహ్నం పేదలకు భోజన సదుపాయంకల్పిస్తున్నాము పేదవారికి ఉచిత భోజన వసతి కల్పించారు. ట్రస్ట్ సభ్యులు స్వయంగా భోజనం పంపిణీ చేస్తూ, ప్రేమ–పరమార్ధంతో ఆదుకోవాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున రెడ్డి మల్టీ స్పెషలిటీ హాస్పిటల్స్ డైరెక్టర్ పి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ, "పేదవారికి ఆహారం సమకూర్చడం చాలా ఆనందం అనిపిస్తోంది. మానవసేవే మాధవసేవ అన్న భావనతో మనం చేసిన చిన్న సహాయం కూడా ఎన్నోకుటుంబాల్లో ఆశ నింపగలదు. ఈ ప్రయత్నం నిరంతరంగా కొనసాగుతూ మరెందరికో ఉపశమనం కలిగించాలని కోరుకుంటున్నాం" ఈ ట్రస్ట్ ని 15 ను సంవత్సరాలనుండి కొనసాగిస్తున్నాము అలాగేమేము ఉన్నంతకాలం నరసింహస్వామి కృప తో .ప్రతి పేద వానికి ఆహారం అందిం చాలని కోరు చున్నాను .

# ఈడి దాడులతో ప్రజల పక్షాన నిలిచే వామపక్షాల గొంతు నొక్కలేరు.




**పామూరు, మే 30, క్రైం కౌంటర్** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరై విజయన్ ఇంటిలో ఈడి దాడులు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం సుందరి భవనం సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్ భాషా మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శవంతంగా కేరళ రాష్ట్రాన్ని అభివృద్ధి పదం వైపు నడిపించినటువంటి ముఖ్యమంత్రి పినరై విజయన్ ఆయన పై మోడీ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిలో దాడులు చేయించడం సిగ్గుచేటు అన్నారు. ఈడి దాడులతో వామపక్షాల గొంతు నొక్కలేరని అన్నారు. ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా వామపక్ష పార్టీలు పోరాటం జరుగుతుందని తెలిపారు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్యానికి, సమాఖ్యవాదానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందని అన్నారు. ఈ నిరంకుశ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, లౌకిక, సమాఖ్య శక్తులతో పాటు ప్రజలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇటువంటి దుర్మార్గపు చర్యలను మోడీ ప్రభుత్వం మానుకోవాలని లేకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే మాల్యాద్రి, యాట వీరనారాయణ, షేక్ కాసిం సాహెబ్, చల్లా వెంకటేశ్వర్లు ఎస్ పిచ్చి రెడ్డి, సయ్యద్ గౌస్ బాషా, షేక్ అల్లాబక్ష, ఎం విటల్ రావు, భాష , దేవరాజ్, శీను,తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతితో ప్రజలకు మెరుగైన ఉత్తమ పోలీసింగ్ సేవలను అందించాలి: ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్.,




**క్రైమ్ కౌంటర్ న్యూస్....ప్రకాశం జిల్లా.....**ప్రకాశం జిల్లా పోలీస్ శాఖలో ఎస్.ఐలుగా విధులు నిర్వహిస్తూ సి.ఐలుగా పదోన్నతి పొందిన వారు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., ని మర్యాదపూర్వకంగా కలిశారు. ముగ్గురు ఎస్సైలు కె. కమలాకర్ (జరుగు పిఎస్), యం. మురళి (దర్శి పిఎస్), యు. వెంకటకృష్ణయ్య(టాస్క్ ఫోర్స్, ఒంగోలు) పదోన్నతి పొందారు. ఈ సందర్భముగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సి.ఐలుగా పదోన్నతి పొందడం బాధ్యతను మరింత పెంచుతుందని, సి.ఐ.గా విధి నిర్వహణలో అంకిత భావముతో, నిబద్దత మరియు నిజాయితీతో ప్రజలకు సుదీర్ఘమైన సర్వీస్ చేస్తూ, పోలీస్ శాఖ గౌరవం, ప్రతిష్ట పెరిగే విధంగా ఎటువంటి రిమార్క్స్ లేకుండా బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు అందుకోవాలన్నారు. భవిష్యత్ లోనూ ప్రజలకు మెరుగైన ఉత్తమ పోలీసింగ్ సేవలను అందించాలని ఆకాక్షించారు.....

# దేశం దాటిన లిక్కర్ స్కామ్ సొమ్ము

**మే 30 (క్రైమ్ కౌంటర్ న్యూస్):**చార్టర్ ఫ్లైట్‌లో చక్కర్లు.. విదేశాల్లో విలాసాలు.. ఖరీదైన హోటళ్లలో బస.. మందు పార్టీలు.. అమ్మాయిలతో చిందులు.. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్ నిందితుల జల్సాలు అన్నీ ఇన్నీ కావు. మద్యం ముఠా వసూలు చేసిన సొమ్మును దేశం దాటించినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) తేల్చింది. ఏపీలో లిక్కర్ డిస్టిలరీస్ నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేయడం.. దుబాయ్‌లో రహస్య ప్రదేశంలో సమావేశాలు ఏర్పాటు చేయడం.. ఆఫ్రికాలో మైనింగ్‌లో పెట్టుబడులు పెట్టడంపై చర్చలు జరపడం.. అన్నింటినీ సిట్ ఆధారాలతో సహా వెలికితీసింది. ఆర్థిక నేరాలకు సంబంధించిన క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లా ఉన్న మద్యం మాఫియా గుట్టు డిజిటల్ ఫోరెన్సిక్ ద్వారా కళ్లకు కట్టినట్లు సిట్ కోర్టు ముందు పెట్టింది. వైసీపీ అభ్యర్థుల ఎన్నికల ఖర్చులకు లిక్కర్ సొమ్ము ఎలా వినియోగించారో తేల్చింది. మద్యం కుంభకోణంలో ఏ–1 రాజ్ కసిరెడ్డి వసూళ్ల గ్యాంగ్‌లో కీలకంగా వ్యవహరించిన ప్రణయ్ ప్రకాశ్‌ను సిట్ అరెస్టు చేసి జైలుకు పంపింది. అతడి పాత్రపై శుక్రవారం విజయవాడ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. దర్యాప్తు బృందం కోర్టుకు తెలిపిన వివరాల మేరకు.. గత వైసీపీ ప్రభుత్వంలో లిక్కర్ సిండికేట్ మద్యం వ్యాపారుల నుంచి వసూలు చేసిన కమీషన్లు నిల్వ చేసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రణయ్ ప్రకాశ్ ప్రత్యేకంగా అపార్ట్‌మెంట్లు అద్దెకు తీసుకున్నాడు.

హైదరాబాద్‌లోని ఖాజాగూడ సర్కిల్‌లో ఉన్న ఉమా హిల్‌క్రెస్ట్ అపార్టుమెంటును క్యాష్ కలెక్షన్ పాయింట్‌గా వాడుకున్నారు. ప్రణయ్ ఫోన్‌లో లభ్యమైన 2021 నాటి ఫొటోల్లో లిక్కర్ డిస్టిలరీల పేర్లతో ఉన్న అట్టపెట్టెల్లో గుట్టలుగా నగదు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనితో ఇతర నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలు సరితూగాయి. నగదు రవాణా సమయంలో బూనేటి చాణక్య, రాజ్ కసిరెడ్డికి ప్రకాశ్ ఫోన్లలో వివరాలు తెలియజేసేవాడు. సిట్ అధికారులు ప్రకాశ్ మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుని డిజిటల్ ఫోరెన్సిక్ నిర్వహించగా.. అందులో నోట్ల పెట్టెలు, మూటలు నిల్వచేసిన ఫొటోలు మొదలుకొని ఎవరెవరు ఎంత ఇచ్చారనే వివరాలు బయట పడ్డాయి. తాడేపల్లిలో డెన్ ఏర్పాటు చేసుకుని వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల సమయంలో చెవిరెడ్డి మనుషుల ద్వారా నగదు పంపణీ చేయడం, విదేశాలకు నిధులు మళ్లించడం, ఆఫ్రికాలో పెట్టుబడులు పెట్టేందుకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో కలిసి ప్రకాశ్ విదేశీ ప్రయాణాలు చేయడం.. ఇలా పలు సంచలన విషయాలను సిట్ చార్జిషీట్‌లో పేర్కొంది. అందుకు సంబంధించిన అన్ని ఆధారాలు కోర్టుకు అందజేసింది. మద్యం ముడుపులు నగదు రూపంలో సేకరించేందుకు వేసిన ఎత్తుగడ, సొమ్ములు దాచేందుకు అవలంబించిన విధానం, ఇతర నిందితులతో సంబంధాలు, చట్టం నుంచి తప్పించుకునేందుకు పన్నిన వ్యూహాలపై జరిగిన చర్చలు, వైసీపీ నేతల భాగస్వామ్య హామీలు, ఫోన్లు ధ్వంసం చేయాలన్న సూచనలు, అక్రమ నిధులు చట్టబద్ధం చేసే ప్రయత్నాల గురించి వివరించింది. డెన్‌లో భారీగా నోట్ల కట్టలు దాచి ఉంచిన ఫొటోలు కోర్టుకు సమర్పించింది. ఒకే చార్టర్ ఫ్లైట్‌లో కసిరెడ్డి, ప్రణయ్ ప్రకాశ్ కలిసి ప్రయాణించిన ఫొటోలు, టాంజానియా విమానాశ్రయంలో చెవిరెడ్డి, ప్రకాశ్ కలిసి ఉన్న ఫొటోలను సిట్ కోర్టుకు సమర్పించింది. కసిరెడ్డితో కలిసి ప్రకాశ్ విలాసాలు చేయడం.. ఖరీదైన హోటళ్లలో బస చేసేందుకు విచ్చలవిడిగా ఖర్చు చేయడం.. యువతులతో చిందులు వేయడం, మద్యం సేవించడం.. అన్నింటినీ డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా వెలికి తీసి సిట్ అధికారులు కోర్టుకు సమర్పించారు. మద్యం సిండికేట్ అక్రమ నిధులతో ప్రణయ్ ప్రకాశ్ జాంబియా, జింబాబ్వే, టాంజానియా వంటి దేశాలకు పెట్టుబడులు పెట్టేందుకు వెళ్లినట్లు వివరించారు. దర్యాప్తు బృందం తేల్చిన మేరకు.. ప్రణయ్ ప్రకాశ్ మొదట్లో క్యాష్ హ్యాండ్లింగ్ మేనేజర్‌గా రాజ్ కసిరెడ్డి వద్దకు చేరి నగదు నిర్వహణతో మాఫియా జీవితాన్ని ప్రారంభించాడు. విశ్వసనీయ సహచరుడిగా ఎదిగి చివరికి ఆఫ్రికాలో పెట్టుబడులు పెట్టే ప్రణాళికలో భాగస్వామిగాఎదిగాడు.మద్యం డబ్బులతో మైనింగ్

మద్యం కంపెనీల కమీషన్లు తీసుకున్న ఈ గ్యాం గ్ రెండు ఆఫ్రికా దేశాల్లో మైనింగ్ కార్యకలాపాల్లో పెట్టుబడులు పెట్టింది. ఈ విషయాన్ని ప్రణయ్ ప్రకాశ్ ఫోన్లలో ఉన్న డేటా తెలియజేసింది. టాంజానియా, జింబాబ్వేలో మైనింగ్ వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టినట్లు ఆధారాలు దొరికాయి. బూనేటి చాణక్య సూచనలతో ప్రణయ్, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు ఆఫ్రికా దేశాల్లో పర్యటించినట్టు ఫోన్లలోని జీపీఎస్ లోకేషన్ల ద్వారా రుజువైంది.

'ఐదు శాతం ఇవ్వకపోతే గుట్టు విప్పేస్తా'

మద్యం డిస్టిలరీల నుంచి కమీషన్లు తీసుకున్న గ్యాంగ్‌లో వాటాలు వివాదాలను పుట్టించాయి. ఈ విషయం ప్రణయ్ ప్రకాశ్ ఫోన్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో విశ్లేషించడంతో తేలింది. ప్రణయ్‌కు భాని అనే వ్యక్తితో వాట్సాప్‌లో వార్ నడిచింది. "నాకు రావాల్సిన ఐదు శాతం వాటాను ఇవ్వలేదు. అక్రమంగా సంపాదించిన డబ్బును అంతా కలిసి పంచుకుని అనుభవిస్తున్నారు. సిట్ అధికారులు నన్ను విచారణలో విల్లా, థియేటర్ వద్ద ఇచ్చిన డబ్బుల గురించి అడుగుతున్నారు. అన్నీ ఒప్పుకొంటే నువ్వు, అనురాగ్ జైలుకు వెళ్లడం ఖాయం. నాకు, నా భార్యకు ఏమైనా జరిగితే మొత్తం స్కాం బయటపెడతాను. తర్వాత విజిల్ బ్లోయర్‌ను నేనే అవుతా" నంటూ వాట్స?ప‌లో ఈ ఏడాది జనవరి 26న సందేశం పంపాడు.

# యువతే దేశ భవిష్యత్..!

**– ఆలోచనలకు వేదికగా 'యంగ్ ప్రొఫెషనల్ రౌండ్ టేబుల్'**
**– యువత అభిప్రాయాలు ప్రభుత్వ విధానాలకు దిశానిర్దేశం చేయగలవు : కలెక్టర్ డా. లక్ష్మీశ**
**– ప్రజాస్వామ్యం, నైపుణ్యాభివృద్ధి, స్థానికత ప్రాధాన్యంపై నిపుణుల మార్గదర్శనం**




**ఏపీ,విజయవాడ,మే 30(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** మై భారత్-- ఎన్‌టీఆర్ మరియు కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ) సమావేశ మందిరంలో "యంగ్ ప్రొఫెషనల్ రౌండ్ టేబుల్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యువత ఆలోచనలు, అభిప్రాయాలు మరియు నాయకత్వ లక్షణాలను వెలికితీసే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విశేష స్పందన పొందింది.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ ఐఏఎస్, ఎస్‌పీఏ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ సిరికొండ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత తమ ఆలోచనలు, సూచనలు ప్రభుత్వానికి చేరవేసేందుకు ఇటువంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సమాజంలో సానుకూల మార్పులకు యువతే ప్రధాన శక్తి అని ఆయన అన్నారు.

ఎస్‌పీఏ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ సిరికొండ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా యువత ఆధ్వర్యంలోని కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం లభిస్తోందని, యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మై భారత్ రాష్ట్ర సంచాలకులు అన్షుమాన్ దాస్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం యువత అభివృద్ధి, నైపుణ్యాల పెంపు, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు మై భారత్ ద్వారా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో నిపుణులు యువతతో ప్రత్యక్షంగా ముచ్చటించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ అన్వేష్ దాసరి ప్రజాస్వామ్యంలో యువత పాత్రపై వివరించగా, సాహితి "లోకల్ ఈజ్ న్యూ గ్లోబల్" భావన వెనుక ఉన్న ప్రాధాన్యాన్ని వివరించారు. కిలారు నాగశ్రావన్ వృత్తి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధిపై యువతకు మార్గనిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో మై భారత్ డీడీ ఉజ్వల్, కిరణ్మయి, జిల్లా యువజన అధికారి బి. ప్రదీప్ కుమార్, స్టెప్ సీఈఓ కొల్లేటి రమేష్, రాము, పృథ్వీ, సుమన్, సీఐఐ ప్రతినిధులు మరియు సుమారు 200 మంది యువత పాల్గొన్నారు. కార్యక్రమం యువతలో నూతన ఆలోచనలకు, నాయకత్వ లక్షణాల పెంపుకు వేదికగా నిలిచింది.

## ఆపరేషన్ క్లీన్ స్వీప్ ను ఉద్యమంగా కొనసాగించాలి.. జిల్లా కలెక్టర్ విజయ సునీత....

**క్రైమ్ కౌంటర్ న్యూస్....మార్కాపురం జిల్లా....** ఆపరేషన్ క్లీన్ స్వీప్ ను ఉద్యమంగా కొనసాగించాలి.. జిల్లా కలెక్టర్ విజయ సునీత.... శుభ్రతకు ప్రాధానమిస్తూ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అన్నారు. మార్కాపురం పట్టణంలోని కంభం సెంటర్ లో శనివారం నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మురుగు కాల్వలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, బాటిల్స్ వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ తో పర్యావరణానికి తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. దీన్ని అరికట్టాల్సిన బాధ్యత అందరి పైన ఉందని తెలిపారు. ప్లాస్టిక్ రహిత మార్కాపురం లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో కాలువలన్నీ శుభ్రం చేయాలన్నారు. ఎక్కడైనా అశుభ్రంగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. అందరి భాగస్వా మ్యంతో ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరు ద్దామన్నారు. ఈ కార్యక్రమంలో



ఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణ రావు, మున్సిపల్, అటవీ శాఖ సిబ్బంది, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ( జిల్లా పౌర సంబంధాల అధికారి మార్కాపురం వారిచే జారీ చేయడమైనది )

## పెంచలకోన నరసింహా స్వామిని దర్శించుకున్న.. దారపనేని





**పామూరు, మే 30, క్రైం కౌంటర్** నెల్లూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం పెంచలకోన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని శనివారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ,తూర్పు కోడిగుడ్లపాడు టిడిపి నాయకులు దార పనేని రాజేంద్రప్రసాద్, పోతవరం గ్రామ టిడిపి నాయకులు మిరియం సుబ్బరాయుడు, నుచ్చు పొద ఫిషర్ మెన్ సొసైటీ మాజీ అధ్యక్షులు కౌలూరి ఖాజా రంతుల్లా, జాజం హరికృష్ణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మాజి మంత్రివర్యులు శ్రీ గాదె వెంకటరెడ్డి ,కి నివాళులు అర్పించిన మాజి ఎమ్మెల్యే అన్నా







**క్రైమ్ కౌంటర్ న్యూస్** బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో మాజి మంత్రివర్యులు పెద్దలు శ్రీ గాదె వెంకటరెడ్డి , నిన్నటి రోజున హైదరాబాద్ నందు మృతి చెందగా నేడు వారి స్వగ్రామానికి తీసుకొని రావడంతో విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు గాదె వెంకటరెడ్డి , పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు...

## హెల్మెట్ ప్రాణ రక్షణ కవచం.!

**– ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**
**– ముఖ్య అతిథులుగా పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, సీఐ సుబ్రహ్మణ్యం**






**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి మున్సిపాలిటీ,మే 30(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ ఆధ్వర్యంలో శనివారం నాడు ఇబ్రహీంపట్నంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ రామచంద్రరావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణనష్టం తగ్గుతుందని తెలిపారు. సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ మాట్లాడుతూ రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఎస్ఐ శివరాం, ట్రాఫిక్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## తాటిచెట్టు పడి ఇద్దరు దుర్మరణం.. విద్యుదాఘాతంతో యువతి మృతి

**మే 30 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** కృష్ణా, బాపట్ల, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో గురువారం రాత్రి పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. వర్షంతోపాటు.. బలమైన గాలులకు తాటి, కొబ్బరి, భారీ వృక్షాలు నేలకొరిగాయి. పలుచోట్లస్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉద్యాన పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. కృష్ణా జిల్లా కోడూరు మండలం కుమ్మరిపాలేనికి చెందిన గరికపాటి మనోహర్‌బాబు (29), చుట్టూరు శివరామకృష్ణ (26) గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా తాటి చెట్టుపడి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. పమిడిముక్కల మండలం లంకపల్లికి చెందిన ముళ్లపూడి అంకిత(17) శుక్రవారం ఉదయం తెగిపడి ఉన్న విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఏలూరు జిల్లా దెందులూరు మండలం సీతంపేటలో తుమ్మల జోస్ఫకు చెందిన పశువుల పాకపై పిడుగు పడడంతో గేదె, దూడ మృతి చెందాయి. బాపట్ల జిల్లాలోని లంక గ్రామాల్లో గురువారం రాత్రి అరగంట పాటు వీచిన తీవ్ర గాలులకు అరటి, బొప్పాయి, తమలపాకు వంటి ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో గీత గీసి ఆరబెట్టిన పచ్చి ఇటుకలు వర్షార్పణం కావడంతో నష్టపోయామని పరిశ్రమదారులు వాపోతున్నారు. కాగా, కాకినాడ జిల్లా కరప మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం వడగళ్ల వాన కురిసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నాయి. ఒంగోలు, ఇతర పట్టణాలతోపాటు వందలాది గ్రామాల్లో అంధకారం నెలకొంది. త్రిపురాంతకం మండలం పాత అన్నసముద్రంలో ఈదురుగాలుల తీవ్రతకు 15 ఇళ్లు దెబ్బతిన్నాయి. కనిగిరి ప్రాంతంలో పొగాకు బ్యారన్లు కూలిపోవడంతో పాటు షెడ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి.




# సినిమా



## కావాలని చేయలేదు..

ప్రముఖ నటి మీనా ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా రాణించింది. ఎంతో మంది స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. ప్రస్తుతం మీనా సినిమాలకు దూరంగా ఉంటున్నారు. కాగా ఓ ఇంటర్వ్యూలో మీనా మాట్లాడుతూ.. తన నటనా ప్రస్థానం, తన కెరీర్ ఎంపికలు, బాలీవుడ్ అవకాశాలపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన పాత్రలను "గ్లిజరిన్ క్యారెక్టర్స్", "పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్"గా, "క్యారెక్టర్-ఓరియెంటెడ్" అని మీనా అన్నారు. మీనా ఉన్నారంటే "100శాతం గ్లిజరిన్ బాటిల్స్ ఉండాల్సిందే" అని అప్పట్లో ఒక ట్రెండ్ ఉండేదని ఆమె గుర్తుచేసుకున్నారు. సావిత్రి, శ్రీదేవి వంటి వారి సినిమాలు చూసినా, వారిని ఫాలో అవ్వకుండా తనదైన ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నానని మీనా అన్నారు. మీనా తన కెరీర్‌లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి దక్షిణాది భాషలలోనే ఎక్కువగా పనిచేశారు. ఆమె ఒక హిందీ సినిమా (పర్దా హై పర్దా) మాత్రమే చేశారు. హిందీలో ఎందుకు కొనసాగలేదని అడిగినప్పుడు, దక్షిణాదిలో తాను "చాలా బిజీగా" ఉన్నానని, రోజుకు రెండు లేదా మూడు షిఫ్ట్‌లు పని చేసేదాన్ని అని తెలిపారు. నిద్రపోవడానికి, భోజనం చేయడానికి కూడా సమయం ఉండేది కాదని ఆమె చెప్పారు.సౌత్ లో డేట్స్ మానేసి బాలీవుడ్‌కి వెళ్తే ఇక్కడి నిర్మాతలు కోపగించుకుంటారని మీనా తెలిపింది. అంతేకాకుండా, బాలీవుడ్‌లో ఒక సినిమాను పూర్తి చేయడానికి ఎక్కువ సమయం పడుతుందని, దక్షిణాది చిత్ర పరిశ్రమలాగా అంత "డిసిప్లిన్డ్"గా ఉండరని తాను విన్నానని మీనా పేర్కొన్నారు. అక్కడ ఒక సినిమా చేయడం ఇక్కడ నాలుగు సినిమాలు చేయడానికి సమానమని ఆమె అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో బాలీవుడ్ గురించి ఆలోచించలేకపోయానని, అయితే హిందీలో నటించాలని కోరుకున్నానని తెలిపారు. హేమమాలిని, వైజయంతిమాల, పద్మిని, రేఖ వంటి నటీమణులు మద్రాసు నుంచి బాలీవుడ్‌కు వెళ్లి విజయం సాధించినప్పటికీ, తనకు బాలీవుడ్‌లో విజయం సాధించాలని ఎప్పుడూ అనిపించలేదని తెలిపారు. హేమమాలిని తప్ప మిగిలిన వారు అక్కడికి వెళ్లడానికి చాలా సినిమాలు వదులుకున్నారని ఆమె గుర్తుచేశారు.మీనాకు దక్షిణాదిలో తమిళం, తెలుగు సహా అన్ని భాషల నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. ఇక్కడ తనకు లభిస్తున్న మంచి అవకాశాలను వదులుకుని, బాలీవుడ్‌లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలోకి వెళ్లడం ఇష్టం లేదని ఆమె అన్నారు. మిథున్ చక్రవర్తి నుంచి తనకు చాలా ఆఫర్లు వచ్చాయని మీనా తెలిపారు. ఊటీకి షూటింగ్ కోసం వెళ్లినప్పుడు, మిథున్ చక్రవర్తిగారి హోటల్‌లో ఉండటానికి భయపడేదాన్నని ఆమె సరదాగా చెప్పారు. ఆయన తన గది వద్దకు వచ్చి, "మీనా జీ, మీరు నాతో సినిమాలు ఎందుకు చేయడం లేదు.?" అని అడిగేవారని, అంత పెద్ద వ్యక్తిని కాదంటే ఇబ్బందిగా అనిపించేదని ఆమె అన్నారు. అలాగే ఆమె మాట్లాడుతూ తెలుగులోనే నాకు మంచి గుర్తింపు వచ్చింది. ఆతర్వాతే తమిళ్, మలయాళ సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి. అలాగే తాను మిస్ చేసుకున్న సినిమాలు చాలా పెద్ద హిట్ అయినప్పుడు చాలా బాధగా అనిపించేది మీనా అన్నారు. అలాగే తెలుగులో నాగార్జున నటించిన నిన్నేపెళ్లాడతా సినిమా మిస్ అయ్యింది. అప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. డేట్స్ అడ్జెస్ట్ అవ్వలేకపోవడంతో ఆ సినిమా మిస్ అయ్యింది. సినిమా కోసం 60 రోజులు డేట్స్ అడిగారు.. అప్పుడు తమిళ్ లో కొన్ని సినిమాలకు కమిట్ అయ్యాను.. దాంతో నిన్నే పెళ్లాడతా సినిమా మిస్ అయ్యింది. ఆతర్వాత ఆ సినిమా చూసినప్పుడు చాలా బాధగా అనిపించింది. అయ్యో మంచి సినిమా మిస్ అయ్యాను అని ఏడ్చేశాను.. అలాగే నరసింహ సినిమాలో రమ్యకృష్ణ పాత్ర మిస్ అయ్యాను. కమల్ హాసన్ తో ఓ సినిమా మిస్ అయ్యింది.



## ఇనుము అంత బలం.. ఆ సమస్యలుంటే ఇట్టే మాయం

మినప సున్నుండలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతానికి చెందిన ఒక సాంప్రదాయక, బలమైన, రుచికరమైన తీపి వంటకం.. మినప సున్నుండల్లో ప్రోటీన్, ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. అందువల్ల ఇది పిల్లల పెరుగుదలకు ఒక అద్భుతమైన ఆహారంగా, పెద్దలకు ఎముకలను బలపరిచే చిరుతిండిగా ఉపయోగపడుతుంది. ఇది సులభంగా జీర్ణమవ్వడంతోపాటు.. అన్ని వయసుల వారికి బలాన్ని రోగనిరోధకశక్తిని మెరుగుపరచడంలో నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే.. మినపప్పును ఉపయోగించి సున్నుండలను సులభంగా తయారు చేసుకోవచ్చు.. మినపప్పు, బెల్లం, నెయ్యితో తయారయ్యే ఈ సున్నుండలు శరీరానికి ఎంతో శక్తిని, పోషకాలను అందిస్తాయి. ఇందులో వాడే నెయ్యి ఆరోగ్యానికి మేలు చేస్తుంది.. అలాగే.. బెల్లం శరీరానికి సహజమైన తీపిని, బలాన్ని ఇస్తుంది. చక్కెర బదులుగా బెల్లం వాడటం ఆరోగ్యానికి మరింత మంచిది.మినప సున్నుండలు తయారు చేసుకోవడం ఎలానో తెలుసుకోండి..



కావలసిన పదార్థాలు:

మినప గుళ్ళు: సరిపోయేంత

బెల్లం- మినపప్పు క్వాంటిటికీ సగానికి పైగా..

యాలకులు

పుట్నాల పప్పు: మినపప్పు క్వాంటిటికి పావువంతు..

నెయ్యి: సరిపోయేంతగా..

తయారీ విధానం:

ముందుగా, ఒక మందపాటి పాన్ తీసుకుని అందులో మినప గుళ్ళను వేయాలి. వీటిని తక్కువ మంటపై 10 నుండి 15 నిమిషాల పాటు కలుపుతూ వేయించుకోవాలి. మినప గుళ్ళు బంగారు రంగులోకి మారి, మంచి సువాసన వచ్చే వరకు వేయించాలి. వేయించేటప్పుడు నూనె వాడకూడదు, కేవలం పొడిగా వేయించుకోవాలి. మధ్య మధ్యలో కలుపుతూ చక్కగా వేయించడం వల్ల అవి క్రిస్పీగా తయారవుతాయి. పదిహేను నిమిషాల తర్వాత మినప గుళ్ళు చక్కగా వేగిన తర్వాత, స్టవ్ ఆపి వాటిని పూర్తిగా చల్లారనివ్వాలి.

చల్లారిన మినప గుళ్ళను ఒక మిక్సీ జార్ లోకి తీసుకోవాలి. వీటితో పాటు యాలకులు, పుట్నాల పప్పును కూడా వేయాలి. ఈ మిశ్రమాన్ని మెత్తటి పొడిలా గ్రైండ్ చేసుకోవాలి.

గ్రైండ్ చేసిన పొడిని ఒక పెద్ద గిన్నెలోకి మార్చుకోవాలి.

తర్వాత, తురిమిన బెల్లాన్ని మిక్సీ జార్ లో వేసి, కొంచెం మెత్తగా పొడి చేసుకోవాలి. (పూర్తిగా పొడి కాకపోయినా పర్వాలేదు, పిండితో కలిపినప్పుడు మెత్తబడుతుంది.) ఇప్పుడు, బెల్లం పొడిని మినప పిండి గిన్నెలో వేసి రెండింటినీ బాగా కలిసేలా చేతులతో కలపాలి. బెల్లం -- మినప పిండి మిశ్రమం పూర్తిగా కలిసిపోయేలా చూసుకోవాలి.

సున్నుండలు చుట్టడానికి, నెయ్యిని కరిగించి పక్కన పెట్టుకోవాలి. మినప పిండి మిశ్రమానికి కొద్దికొద్దిగా కరిగిన నెయ్యిని కలుపుతూ ఉండలు చుట్టాలి. పిండి గట్టిగా పట్టుకున్నప్పుడు ఉండగా మారేంత నెయ్యి వేయాలి. చిన్న చిన్న ఉండలుగా చుట్టి ఒక ప్లేట్ లో పెట్టుకోవాలి. ఈ సున్నుండలు గట్టిగా, చక్కటి ఆకారంలో వచ్చే వరకు నెయ్యిని తగినంత కలుపుతూ ఉండాలి.

ఈ విధంగా తయారు చేసిన మినప సున్నుండలను గాలి చొరబడని డబ్బాలో నిల్వ ఉంచుకుంటే నెల రోజుల వరకు తాజాగా ఉంటాయి. ఇవి పండుగలకు, ప్రయాణాలకు లేదా సాధారణ సమయాలలో బలమైన స్నాక్ గా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

## రోహిణి కార్తెలో వంకాయ తింటే ఏమవుతుందో తెలుసా..?



తెలుగు రాష్ట్రాల్లో భానుడు అగ్నిగోళాన్ని తలపిస్తున్నాడు. "రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయి" అనే సామెతను నిజం చేస్తూ.. అత్యంత పవర్‌ఫుల్ రోహిణి కార్తె ఎండలు దేశాన్ని, ముఖ్యంగా ఏపీ, తెలంగాణలను వణికించడానికి సిద్ధమయ్యాయి. జ్యోతిష్య, ఆయుర్వేద శాస్త్రాల ప్రకారం.. ఈ సమయంలో సూర్యుడి కిరణాలు భూమిపై నిట్టనిలువుగా పడటం వల్ల మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు మించి నమోదయ్యే అవకాశం ఉంది. ఈ ఎండల్లో ఆరోగ్యంగా ఉండటానికి ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం అత్యవసరం. అయితే ఈ రోహిణి కార్తె తొలినాళ్లలో ఒక కూరగాయను మాత్రం అస్సలు ముట్టుకోకూడదని ఆయుర్వేద నిపుణులు హెచ్చరిస్తున్నారు. అదేంటో కాదు.. మనందరికీ ఇష్టమైన వంకాయ. రోహిణి కార్తెలో వంకాయను ఎందుకు నిషేధించారో ఇప్పుడు తెలుసుకుందాం..ఆయుర్వేదం ప్రకారం వంకాయ వేడి శరీరానికి శత్రువు

సాధారణంగా వంకాయతో రకరకాల వంటకాలు చేసుకుని ఇష్టంగా తింటాం. కానీ ఆయుర్వేద శాస్త్రం ప్రకారం వంకాయ అనేది తీవ్రమైన వేడి స్వభావం కలిగిన కూరగాయ. రోహిణి కార్తెలోని ఈ మొదటి తొమ్మిది రోజులలో వంకాయను మీ డైట్‌లో చేర్చుకోవడం వల్ల బాడీలో ఇంటర్నల్ హీట్ విపరీతంగా పెరిగిపోయి, అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.

వంకాయ తినడం వల్ల వచ్చే సమస్యలు ఇవే..

జీర్ణక్రియ అస్తవ్యస్తం: రోహిణి కార్తెలో వాతావరణంలో ఉండే అధిక వేడి వల్ల మన జీర్ణవ్యవస్థ ఇప్పటికే చాలా బలహీనపడుతుంది. ఈ టైంలో వేడి, బరువైన ఆహారమైన వంకాయను తింటే అది అరగడానికి చాలా సమయం పడుతుంది. దీనివల్ల అజీర్ణం, తీవ్రమైన ఎసిడిటీ, గుండెల్లో మంట, చంచలత్వం, వాంతులు అయ్యే ప్రమాదం ఉంది.చర్మ సమస్యలు: వంకాయలోని ఉష్ణ తత్వం వల్ల ఈ రోజుల్లో చర్మంపై దద్దుర్లు, వేడి గడ్డలు, చెమటకాయలు లేదా విపరీతమైన దురద వంటి అలర్జీ సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

మరి ఈ రోజుల్లో ఏం తినాలి? ఏం తాగాలి?

ఎండల తీవ్రతను తట్టుకుని శరీరం చల్లగా, హైడ్రేటెడ్‌గా ఉండాలంటే రోహిణి కార్తె ముగిసే వరకు తేలికైన, నీటి శాతం ఎక్కువ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు:

నీటి శాతం ఉన్న పండ్లు: పుచ్చకాయ, మస్క్ మిలన్, దోసకాయలను ఎక్కువగా తీసుకోవాలి.

చల్లని పానీయాలు: రోజుకు రెండు మూడు సార్లు నిమ్మరసం, పల్చటి మజ్జిగ లేదా లస్సీ తాగడం వల్ల శరీరానికి మేలు జరుగుతుంది.

సీజనల్ ఫ్రూట్స్: ఈ కాలంలో లభించే తాజా పండ్లను తీసుకోవడం వల్ల వడదెబ్బ తగలకుండా కాపాడుకోవచ్చు.

కూరగాయల్లో వంకాయ టేస్టే వేరైనా.. ఈ కార్తె ముగిసే వరకు దానికి కాస్త దూరంగా ఉండటమే మీ ఆరోగ్యానికి శ్రీరామరక్ష. సాధ్యమైనంత వరకు చలవచేసే ఆహార పదార్థాలు తింటూ సురక్షితంగా ఉండండి.

## గుజరాత్‌పై టీమిండియా మాజీ ప్లేయర్ ఫైర్

ఐపీఎల్ రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని అవుట్ చేయడానికి గుజరాత్ టైటాన్స్ బౌలర్లు అనుసరించిన బాడీ లైన్ బౌలింగ్ వ్యూహంపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. కేవలం 15 ఏళ్ల కుర్రాడిపై అంతగా విరుచుకుపడటం తన మనసును గాయపరిచిందంటూ పఠాన్ భావోద్వేగానికి లోనయ్యాడు.ఐపీఎల్ 19వ సీజన్ ముగింపు దశకు చేరుకుంది. నిన్న జరిగిన రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై గుజరాత్ టైటాన్స్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ నెల 31న జరగబోయే మహా సంగ్రామంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుతో గుజరాత్ తలపడనుంది. అయితే, ఈ మ్యాచ్ ఫలితం కంటే కూడా రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశి బ్యాటింగ్, అతనిపై గుజరాత్ బౌలర్లు ప్రయోగించిన అస్త్రాలే ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారాయి. కుర్రాడిపై బాడీ లైన్ బౌలింగ్ అటాక్.. ఈ కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో, 15 ఏళ్ల వయసున్న వైభవ్ సూర్యవంశీని ఒత్తిడిలోకి నెట్టేందుకు గుజరాత్ టైటాన్స్ బౌలర్లు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. నిరంతరం షార్ట్ పిచ్ బంతులు వేస్తూ, నేరుగా అతని శరీరాన్ని లక్ష్యంగా చేసుకుని (బాడీ లైన్ బౌలింగ్) బౌలింగ్ చేశారు. బంతులు వరుసగా ఒంటికి తగులుతున్నా, ఆ వయసులోనే వైభవ్ చూపిన అసాధారణ ధైర్యం అందరినీ ఆశ్చర్యపరిచింది. గుజరాత్ బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ కేవలం 47 బంతుల్లోనే 96 పరుగుల సునామీ ఇన్నింగ్స్ ఆడి రాజస్థాన్‌కు భారీ స్కోరు అందించాడు.ఒక తండ్రిగా నా మనసు అంగీకరించడం లేదు: ఇర్ఫాన్ పఠాన్.. మ్యాచ్ అనంతరం ఈ బాడీ లైన్ బౌలింగ్ వ్యూహంపై ఇర్ఫాన్ పఠాన్ స్పందిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. అత్యున్నత స్థాయి క్రికెట్‌లో సీనియర్ ఆటగాళ్లతో పోటీ పడుతున్నప్పుడు ఇలాంటి కఠినమైన వ్యూహాలు సహజమేనని తనకు తెలుసని పఠాన్ పేర్కొన్నాడు. అయితే, ఒక తండ్రి స్థానంలో ఉండి ఆలోచిస్తే మాత్రం ఆ చిన్న వయసు కుర్రాడి శరీరాన్ని టార్గెట్ చేస్తూ బౌలింగ్ చేయడం తన మనసుకు అస్సలు నచ్చలేదని స్పష్టం చేశాడు. కేవలం 15 ఏళ్ల వయసున్న ఆటగాడిపై అంతటి ఒత్తిడి తీసుకురావడం బాధాకరమంటూ ఇర్ఫాన్ పఠాన్ సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించాడు.



Published & Owned by katikala Vara Prasad, Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.AP-522006.published at D.no465 Le out no2,Dodleru Road.Ysr Jagananna colony,Krosuru,Guntur AP-522410, Chief Editor Katikala Vara Prasad Reg No's: RNI APTEL/2015/62250, APTEL/25/A2478 & APTEL/25/A2844,APTEL/25/A2843, Ph:9849707349 .
email:kvp6858@gmail.com, website :www.crimecounter.In